క్లుప్తంగా

విద్యార్థులకు నగదు ప్రోత్సాహం



భీమవరం పీఎస్‌ఎమ్ స్కూల్ విద్యార్థులకు నగదును అందిస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని పొట్టిశ్రీరాములు మున్సిపల్(పీఎస్‌ఎమ్) గరల్స్ హైస్కూల్లో మంగళవారం ప్రతిభ కలిగిన విద్యార్థులు 10 మందికి నగదు ప్రోత్సాహం అందించారు. పట్టణంలోని తుమ్మలపల్లి మంగరాజు(టీఎంఆర్) చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఒక్కొక్క విద్యార్థికి రూ. 2 వేలు చొప్పున ప్రోత్సాహాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం జె సుధారాణి, అరసవల్లి ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం , చెరుకువాడ రంగసాయి, ఉపాధ్యాయులు వారణాసి రాధాకృష్ణ, శ్రీదేవి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



జక్కరం గ్రామంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కాళ్ల: గ్రామీణ ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలు , స్కీమ్‌లపై అందరికీ పూర్తి అవగాహన ఉండాలని పలువురు ప్రతినిధులు అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం జక్కరం , వేంపాడు గ్రామాల్లో నిర్వహించిన సభల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలు, స్కీములపై అవగాహన కల్పించి నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరించారు. బీజేపీ ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి కోరా రామ్మూర్తి, సత్యనారాయణరాజు, పార్టీ మండల అధ్యక్షుడు సుంకర కాశీ విశ్వేశ్వరరావు , కోలనపల్లి సర్పంచ్ కె.సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.


విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలి



అనాకోడేరులో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని ఏర్పరుచుకుని దానిని సాధించే వరకు కష్టపడి ఇష్టంతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సర్పంచ్ జుత్తిగ కనక దుర్గ వర ప్రసాద్ అన్నారు. భీమవరం మండలంలోని అనాకోడేరులో డీఎన్నార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జుత్తిగ కనకదుర్గ వర ప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు నేడు ద్వారా సర్కారు పాఠశాలలను కార్పొరేట్ స్కూల్స్‌కు ధీటుగా అభివృద్ధి చేశారన్నారు. అనంతరం జాతీయ చేతిరాత దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు రాత పరీక్ష నిర్వహించి బాగా రాసిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బి. వెంకటేశ్వర్లు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ గూడపాటి మిల్లన్, జి. సరోజిని, ఉపాధ్యాయులు రేపాక వెంకన్నబాబు, వి.మెర్సీ, నిర్మలాకుమారి, రాధామణి పాల్గొన్నారు.

టెన్త్‌లో మంచి ఫలితాలు సాధించాలి



భీమవరం పీఎస్‌ఎమ్ స్కూల్లో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ వెంకటరమణ

భీమవరం: టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ అన్నారు. మంగళవారం భీమవరం పట్టణంలోని పొట్టిశ్రీరాములు మున్సిపల్ గరల్స్ హైస్కూల్లో విద్యార్థులతో మాట్లాడారు. స్కూల్ హెచ్‌ఎం జె సుధారాణి మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు అంచనావేస్తూ వెనుకబడిన విద్యార్థుల గురించి అనుచరించాల్సిన విధానాలపై ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. వీఎం రాధాకృష్ణ, ఎంకేఎస్‌ఎస్ మహాలక్ష్మి, కె.శ్రావణి, ఎకే మహాలక్ష్మి పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో పేర్లు సరిచూసుకోవాలి

యలమంచిలి: మండలంలోని 57 పోలింగ్ కేంద్రాల్లో కొత్త ఓటర్ల జాబితా ప్రచురించామని తహసీల్దార్ మాతా సునీల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎల్వోల వద్ద ఓటర్ల జాబితా ఉందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేవో సరిచూసుకోవాలని ఆయన కోరారు. ఓటర్ల జాబితాలో తప్పొప్పులు ఉంటే ఈ నెల 26లోపు సరి చేయించుకోవాలని ఆయన కోరారు.

ప్రజా శ్రేయస్సే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ లక్ష్యం

- ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ అమలు
- రాష్ట్ర ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్



దిరుసుమర్రులో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్



తోకతిప్పలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం అర్బన్: ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని రూ.10 కోట్ల 15 లక్షలతో జరిగిన అభివృద్ధి పనులను మంగళవారం ప్రారంభించి మరికొన్ని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ముందుగా తోకతిప్పలో రూ.18 లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనానికి, రూ.5 లక్షలతో నిర్మించబోయే సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. రూ. 8 లక్షల 30వేలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. దెయ్యాలతిప్పలో రూ. 20 లక్షలతో నిర్మించిన 2 సీసీ రోడ్డును, దిరుసుమర్రులో రూ.9 కోట్లతో హరిజనపేట నుంచి కోమటితిప్ప నార్త్ 5 కిలోమీటర్లు బీటీ, సీసీ రోడ్డును, రూ.23 లక్షల 94 వేలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ. 40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంధి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారని ప్రజల వద్దకు వెళ్లి ఓటు అడిగే హక్కు వైఎస్సార్ సీపీకే ఉన్నదన్నారు. నియోజకవర్గంలో ప్రజల సొంతింటి కల నిజం చేసేందుకు 15 వేల మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇచ్చామన్నారు. లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం ద్వారా రూ. లక్షా 80 వేలు ఉచితంగా ఇస్తున్నామన్నారు. కరోనా సమయంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కుప్పకూలినా సంక్షేమ పథకాలు అమలు చేయడంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెనుకంజ వేయలేదన్నారు. 2014లో చంద్రబాబు ఎన్నికల్లో 600 పైగా హామీలు ఇచ్చి తీరా అధికారం చేపట్టాక ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు.

చంద్రబాబు, పవన్‌లను నమ్మవద్దు

ఈ ఎన్నికల్లో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు రాష్ట్ర ప్రజలను మోసం చేసేందుకు ముందుకు వస్తున్నారని ప్రజలు వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, అదే మాదిరిగా తనకు నియోజకవర్గంలో ప్రజల మద్దతు పూర్తిగా ఉందన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఎన్ని కుట్రలు చేసిన ప్రజలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు పేరిచర్ల విజయ నరసింహరాజు, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, జెడ్పీటీసీ సభ్యుడు కాండ్రేగుల నరసింహరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, సర్పంచ్‌లు కోళ్ల బాలకృష్ణ, తిరుమాని శ్రీను, తిరుమాని శ్రీనివాస్, నాగిడి నారాయణస్వామి, కేతా నాగమణి, తేలి జోషఫ్ రవికుమార్, జల్లా కొండయ్య, చిల్లే వెంకటేష్, రామాని నరసింహస్వామి, బొమ్మిడి బాబు రాజేంద్రప్రసాద్, కొప్పర్తి సత్యనారాయణ, బొమ్మిడి కొండరాజు, సంధి యోహాన్, రామాని రెడ్డియ్య, కొట్టి కుటుంబరావు, నామన మహేష్, జవ్వాది గణేష్, తిరుమాని సింగన్నదొర తదితరులు పాల్గొన్నారు.

నేడు నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలు

ఉండి: ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గస్థాయి ఆటల పోటీలు మండలంలో బుధవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ ఎస్.రవీంద్ర మంగళవారం తెలిపారు. ఉండి, ఉప్పులూరు, మహదేవపట్నం గ్రామాల్లో నిర్వహించే ఈ ఆటల పోటీల్లో ఉండి, ఆకివీడు, కాళ్ల, పాలకోడేరు మండలాలకు చెందిన మండల విజేతలైన జట్లు ఆయా ఆటల పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఉండిలో క్రికెట్, ఖోఖో, బ్యాడ్మింటన్, ఉప్పులూరులో కబడ్డీ, మహదేవపట్నంలో వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అన్ని పోటీలు ఆయా జెడ్పీ హైస్కూల్స్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్నామని అన్నారు.

దొంగతనంపై కేసు

ఆకివీడు: స్థానిక లారీ సప్లయ్ ఆఫీసు వద్ద గ్యాస్ బండ, ఐరన్ దొంగిలించుకుపోతున్న కోళ్లపర్రు గ్రామానికి చెందిన కొణతం ఆంజనేయుల్ని పట్టుకుని పోలీసు స్టేషన్‌కు మంగళవారం అప్పగించారు. లారీ యజమాని గంధం సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సత్యనారాయణ చెప్పారు.

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి



31వ వార్డులో జరిగిన వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

భీమవరం(ప్రకాశం చౌక్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని వైసీపీ పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య, జేసీఎస్ కన్వీనర్ గాదిరాజు సుబ్రహ్మణ్యం రాజు అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక 31వ వార్డులో వార్డు ఇన్‌చార్జ్ చిగురుపాటి సందీప్ ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించి అనంతరం వార్డులో ర్యాలీ నిర్వహించారు. అలాగే సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో భోగయ్య, తాతారాజు మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో పేదలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకోవడంతో పాటు వారిని అన్నింటా చైతన్యం చేశారన్నారు. కార్యక్రమంలో ఏఎస్.రాజు, రేవురి గోగురాజు,పాలవెల్లి మంగ,గంటా సుందర్ కుమార్, మెట్ట మురళీ,చెల్లబోయిన సూర్యప్రకాష్, పిప్పళ నాని,నందమూరి ఆంజనేయులు, కరిమూల భాషా, ముత్యాల బుజ్జి,పాలపర్తి జోనా, రామభద్ర గౌడ్,వుండారి శ్రీను, మేక మంగ, గొల్ల భాస్కరరావు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లలో పూర్తి స్థాయి మౌలిక వసతులు



వీరవాసరం మండలంలో పోలింగ్ స్టేషన్లు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి

వీరవాసరం: పోలింగ్ స్టేషన్లలో పూర్తి స్థాయి మౌలిక సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదేశించారు. మండలంలోని చింతలకోటిగరువు, నడపన వారిపాలెం, తోలేరు, పడమటపాలెం గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లను మంగళవారం కలెక్టర్ ప్రశాంతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్లలో ఎక్కడా ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. పురుషులకు, మహిళలకు వేర్వేరుగా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ వెళ్లే మార్గం, వచ్చే మార్గం వేర్వేరుగా ఉండాలని సూచించారు. దివ్యాంగులకు వీలుగా ర్యాంప్‌లను సిద్ధం చేయాలన్నారు. లైటింగ్ సౌకర్యం పక్కాగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ కె.శ్రీనివాసరాజు, తహసీల్దార్ ఎం.సుందర్ రాజు, ఎంపీడీఓ కె.జ్యోతి పాల్గొన్నారు.

యనమదుర్రులో..

భీమవరం అర్బన్: మండలంలోని యనమదుర్రు గ్రామంలో మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల సౌకర్యాల కల్పన గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులను జిల్లా కలెక్టర్ ప్రశాంతి పరిశీలించారు. కలెక్టర్ పి. ప్రశాంతి వెంట ఆర్డీఓ కె.శ్రీనివాసులు రాజు, తహసీల్దార్ వై.రవికుమార్ ఉన్నారు.

టిడ్కో లబ్ధిదారులకు ఇంటి పట్టాల అందజేత



టిడ్కో లబ్ధిదారులకు పట్టాలు అందిస్తున్న కామన నాగేశ్వరరావు

భీమవరం (ప్రకాశంచౌక్): పేదలకు టిడ్కో ఇళ్లను (300 అడుగులు) ఉచితంగా అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. మంగళవారం భీమవరం 28వ వార్డులో ఇన్‌చార్జి సుంకర బాబూరావు టిడ్కో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందించారు. ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రాంతంలో నిర్మించిన ఖరీదైన టిడ్కో ప్లాట్లను పేదలకు ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ఆర్థిక భారాన్ని ప్రభుత్వం భరిస్తూ వారి సొంతింటి కలను నెరవేర్చారన్నారు. 365, 430 అడుగుల ఇళ్ల డిపాజిట్ సొమ్ములో రాయితీని కూడా జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారన్నారు. భీమవరానికి సంబంధించి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ టిడ్కో ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయించి లబ్ధిదారులకు మొదటి రెండు విడతల్లో 5,800 ఇళ్లను లబ్ధిదారులకు అందించారన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు తోట భోగయ్య, పార్టీ నాయకులు ముత్యాల రామారావు, పాలవెల్లి మంగ, మానేపల్లి నాగేశ్వరరావు, చెల్లబోయిన సూర్యప్రకాష్, ఇంటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సుందరరామరాజు

భీమవరం: నేతాజీ జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని, నేతాజీ జయంతిని దేశ్ ప్రేమ దివస్‌గా కేంద్రం ప్రకటించాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి పీవీ సుందరరామరాజు అన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా నేతాజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం సుందరరామరాజు మాట్లాడుతూ ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి లంక కృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, ఉండవల్లి రమేష్ నాయుడు, గంటా సుందర్ కుమార్, పి.గోపాలరాజు, చినిమిల్లి వీరబాబు, దండు శ్రీనివాసరాజు, కనుమూరి వెంకటపతిరాజు, డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో పరిశీలన



భీమవరం ఆర్టీసీ డిపోలో జోనల్ చైర్మన్ పిన్నెంటి మహేష్

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం ఆర్టీసీ డిపోను మంగళవారం విజయవాడ జోన్ జోనల్ చైర్మన్ పిన్నెంటి మహేష్ పరిశీలించారు. డిపోలో అన్ని విభాగాలు ఆయన చూసి పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆయనకు భీమవరం డిపో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని వినతి పత్రం అందజేశారు. అలాగే యూనియన్ నాయకులు ఉద్యోగుల సమస్యల గురించి లాంగ్ డిస్టెన్స్, కొత్త సర్వీసులు పునరుద్ధరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు తెలియజేసిన సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఆయన డిసెంబర్ నెలలో అత్యధిక కేఎంపీఎల్, అత్యధిక ఆదాయం ఆదాయం తెచ్చిన ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ పి.ఎస్, సత్యనారాయణ మూర్తి, కృత్తివెన్ను ఎంపీపీ కూనసాని తాతాజీ, కూనసాని వాసు,పెదశింగు చిన్నా, అసిస్టెంట్ మేనేజర్ సురేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు వేగేశ్న వెంకట్రాజు

ఆకివీడు: కీర్తి ప్రతిష్టలు, ధనం, బలం వంటివి విద్యతోనే సాధ్యమని జెడ్పీటీసీ సభ్యుడు వేగేశ్న వెంకట్రాజు (యండగండి శ్రీను) చెప్పారు. స్థానిక పులవర్తి లక్ష్మణస్వామి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు జిల్లా పరిషత్ ముద్రించిన ఉచిత స్టడీ మెటీరియల్ పుస్తకాలను మంగళవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదో తరగతి విద్య కీలకమైనదన్నారు. ఉన్నత చదువులు చదివినా పదవ తరగతి మార్కుల్ని పరిగణలోకి తీసుకుంటారన్నారు. విద్యార్థికి పదో తరగతి దిక్సూచీలాంటిది అని అన్నారు. పాఠశాలలో మంచి మార్కులు సాధించి మెరిట్ విద్యార్థిగా పాఠశాల బోర్డులో పేరు చిరస్థాయిగా మిగిలిపోతుందన్నారు. టెన్త్ విద్యార్థులంతా ప్రథమస్థానంలో ఉత్తీర్ణులయ్యే విధంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏఎంసీ చైర్మన్ ఎస్కే రసూల్‌బీబీ మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులు గట్టిపునాది వేసుకోవాలన్నారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తుందని, సీఎం జగన్ పేద విద్యార్థుల చదువుకు అధిక నిధులు కేటాయిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షులు అంబటి రమేష్, హెచ్‌ఎం తోట పోతరాజు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ నెల్లి సతీష్, మాజీ ఉపసర్పంచ్ ఎస్కే హుస్సేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం ఎనిమిదో తరుగతి విద్యార్థులకు 182 ట్యాబ్‌లను పంపిణీ చేశారు.

ఘనంగా ప్రభోత్సవం



భీమవరంలో ప్రభోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): గునుపూడి గ్రామ దేవత శ్రీ ఆదిలక్ష్మి రాజ్యలక్ష్మీ, పోలేరమ్మ అమ్మవారి 33వ మహా జాతరలో భాగంగా మంగళవారం సాయంత్రం శ్రీ ఆదిలక్ష్మీ అమ్మవారి పొలిమేర విస్సాకోడేరు వంతెన వద్ద నుంచి అమ్మవారి ప్రభ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలతో, కేరళ ప్రత్యేక బృందం వారిచే తీన్మార్ డప్పులు తో శోభాయాత్ర నిర్వహించారు. డీసీఎంఎస్ చైర్మన్ వేంద్ర వెంకటస్వామి అమ్మవారికి పూజా కార్యక్రమాలు చేసి ప్రభోత్సవం ప్రారంభించారు. ఈ సందర్భంగా వేంద్ర వెంకటస్వామి మాట్లాడుతూ గత 33 ఏళ్లుగా రజక యూత్ అసోసియేషన్ వారు అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. అమ్మవారి ప్రభ మహోత్సవం భీమవరం సరిహద్దు పొలిమేర నుంచి బుధవారం మార్కెట్, వీరమ్మ పార్కు, నాచు వారి సెంటర్, 18 వ వార్డు మీదుగా నుండి అమ్మవారి గుడికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో గుబ్బల తమ్మయ్య, బొక్కా చంద్ర మోహన్, అమనాపు అప్పారావు, దొమ్మేటి సుబ్బయ్య, కొత్తపల్లి వెంకటేశ్వర రావు, ఎదునూరి గంగాధర్ తిలక్, గరగపర్తి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత, సాహిత్యం మానవుడికి మార్గదర్శకాలు



ఉమర్ ఆలీషా పురస్కారం అందుకుంటున్న డాక్టర్ వాసిలి వసంతకుమార్

భీమవరం(ప్రకాశం చౌక్): ఆధ్యాత్మికత, సాహిత్యం , సంగీతం మానవుని జీవన తత్వానికి మార్గదర్శకాలని పిఠాపురం శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. డాక్టర్ ఉమర్ ఆలీషా సాహితీ సమితి ఆధ్వర్యంలో స్థానిక త్యాగరాజ భవనంలో మంగళవారం నిర్వహించిన దివంగత 6వ పీఠాధిపతి కవిశేఖర డాక్టర్ ఉమర్ ఆలీషా 79వ వర్ధంతి సభకు ఆలీషా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్య జీవితంలో అనేక ఒత్తిడులతో జీవన పయనాన్ని కొనసాగిస్తున్న మాన వుడు ఆధ్యాత్మికత, సాహిత్యం, సంగీతంపైజ్ఞానాన్ని పెంపొందించుకుని తన జీవన విధానంలో ఆచరించాలని తెలిపారు. ఉమర్ ఆలీషా సాహితీ సమితి ద్వారా అందిస్తున్న, ఉమర్ ఆలీషా కవి పురస్కా రానికి విశ్వర్శి, సాహితీవేత్త డాక్టర్ వాసిలి వసంతకుమార్ ను ఎంపిక చేయడం తనకెంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. ఉమర్ ఆలీషా సాహితీ సమితి ద్వారా భీమవరంలో 31 సంవత్సరాలుగా విశిష్ట కార్యక్రమాలు నిర్వహిస్తూ సాహితీ సేవ చేస్తున్న సమితి సభ్యులను పీఠాధిపతి అభినందించారు. అనంతరం పీఠాధిపతి ఉమర్ అలీషా పురస్కార గ్రహీతకు స్మారక పురస్కా రాన్ని, 50,116 రూపాయల నగదు ప్రోత్సాహకాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్త జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, సమితి కార్యదర్శి దాయన సురేష్ చంద్రజీ, ఉపాధ్యక్షుడు త్సవటపల్లి మురళీకృష్ణ, కోశాధికారి వడ్డాది శ్రీ వెంకటేశ్వర శర్మ, వేగేశ్న సత్యవతి, వడ్డి విజయలక్ష్మి, త్సవటపల్లి సాయి వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పారదర్శకంగా నిర్వహించాలి

వీరవాసరం: ఉపాధి హామీ పనులను పారదర్శకంగా నిర్వహించాలని పీడీ ఎస్‌టీవీ రాజేశ్వరరావు తెలిపారు. వీరవాసరం ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికీ 100 రోజులు పని దినాలు కల్పించాలని వివరించారు. పంట కాలువలు, పంట బోదెలు తవ్వకంతో పాటు, చిన్న చెరువుల తవ్వకం, కొబ్బరి, మునగ, నిమ్మ, మామిడి తదితర తోటలను వేసుకునే విధంగా రైతులను ప్రోత్సహించాలన్నారు. తద్వారా ఉపాధి హామీ పనులు కూలీ సంఖ్య పెరుగుతుందన్నారు. పలు గ్రామాల్లో గుర్తించిన లోపాల ద్వారా ఫీల్డ్ అసిస్టెంట్లను రూ.23,310 రికవరీ చేశారు. వీరవాసరం మండలంలో 2022–23 సంవత్సరానికి గాను రూ.4,46,91,154 విలువైన పనులు నిర్వహించి కూలీలకు జమ చేశామన్నారు. సమావేశంలో ఏపీడీ కె.విజయలక్ష్మి, డివిజనల్ విజిలెన్స్ ఆఫీసర్ విజయలక్ష్మి, ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని, ఎంపీడీవో కె జ్యోతి, టీపీ సుధీర్, వాసా పెద్దింట్లమ్మ, బండి వరలక్ష్మి, బాలకృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధితులకు పునరావాసం కల్పించాలి

పాలకోడేరు: దళితుల రక్షణ కోసం అమలు చేస్తున్న ఎస్సీ, ఎస్టీ, అత్యాచార నిరోధక చట్టం లో సెక్షన్ 3,1,(టి), సెక్షన్ 3,1,(వై) లను చేర్చి వాటి ప్రకారం నిందితులను శిక్షించాలని చట్టంలో పొందుపర్చిన వాటి ప్రకారం బాధితులకు ఆర్థిక పునరావాసం కల్పించాలని గరగపర్రు బాధితుల కమిటీ కోరింది. ఈ మేరకు కోర్టు అనుమతి తీసుకుని మెమో వేయాలని కోరుతూ జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ కి వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం భీమవరం డీఎస్పీ బి.శ్రీనాథ్‌ను కూడా కలిశామని తెలిపారు. కటికతల యోహాను, దాసరి ఇస్సాకు, గొంతి చిన్ని, డొల్ల పేతురు, ఎరిచర్ల రాజేష్ పాల్గొన్నారు.